దేవుడు వస్తున్నాడు, తరువాత కర్మసిద్ధాంతం, పుణ్యకర్మలు, పాపకర్మలు వస్తున్నాయి. అంటే ఈ సృష్టి యొక్క హిస్టరీ అంతా హృదయంలో నుండి ప్రారంభమవుతోంది. అందుచేత నువ్వు హృదయంలోనికి వెళ్ళి అణిగిపోతే ఇప్పుడు మనం చెప్పకొనే గొడవలు అన్నీ అణిగి పోతాయి, అప్పటివరకు ఈ సృష్టి ఎవరినీ విడిచిపెట్టదు. బాగుపడేవారు అందరు భాగవతం చదవండి అని ఒక సామెత ఉంది. భాగవతంలో భగవంతుడి లీలలు అన్నీ ఉంటాయి. భగవంతుడి లీలలు మనం వింటూ ఉండాలి. భగవంతుడి లీలలు వింటూ ఉంటే మన మనస్సు భగవంతుడిలో లయమవుతుంది. భగవంతుడి యొక్క శక్తి, ఆయన యొక్క వైభవం మనకు తెలిస్తేనే భగవంతుడిని ప్రేమించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. రమణ మహర్షిగారు చెప్పినవి ఎంగిలి ముక్కలుకాదు. దర్శన గ్రంధాలు. దర్శన గ్రంధాలు అంటే ఆయన దర్శించి, వారు అనుభవించి మనచేత దర్శింపచేయటానికి చెప్పిన ఉపాయాలే దర్శనగ్రంధాలు. ప్రతీ మాటలోను ఆయన అనుగ్రహం ఉంటుంది. కొంతమంది దర్శిస్తారు, దర్శించినది చెప్పలేరు. వారు దర్శించినది మనకు చెప్పగలుగుతున్నారు అంటే వారు కారణ జన్మలు. దర్శించటంలో ఎంత కష్టం ఉందో దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పటం కూడా అంతే కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా మనకు ఆ గిఫ్టు రాదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 08-06-08, మహేంద్రవాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో ఒక అమృతం ఉంది. అమృతానికి చావు ఎలా ఉంటుందో తెలియదు. పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు, సంసారం ఎలా ఉంటుందో తెలియదు. అది ఉంటుంది. అలాగ ఉండదు, ఇలాగ ఉండదు అది ఎలా ఉండాలో అలాగ ఉంటుంది. సూర్యుడుకి చీకటి గురించి ఎలాగ తెలియదో అలాగ లోపల ఉన్న సద్వస్తువుకి మృత్యువు గురించి తెలియదు. అందుచేత దానిని అమృతం అన్నారు. ఆ అమృతం తన 16వ సంవత్సరములోనే రమణమహర్షిగారికి అనుభవంలోనికి వచ్చింది. అది అనుభవంలోనికి వచ్చాక మన మనోదేహములకు దానికి ఏమీ సంబంధం లేదని మనకు తెలుస్తుంది. మనకు కనిపిస్తున్న ప్రపంచము, విషయాలతో మన మనోదేహములతో ఏమీ సంబంధం లేకుండా స్వతంత్ర్యముగా ఉన్న వస్తువును తాలూకా అనుభవం మనం పొందాలి. అదే మన జీవిత గమ్యం. మిగతావన్నీ స్వప్న సమానాలు. మనం లౌకికవిద్య, ఆత్మవిద్య రెండు విద్యలు నేర్చుకోవాలి. లౌకికవిద్యలు

కేవలము దేహయాత్రకు ఉపయోగపడతాయి. అంటే ఇతరుల మీద ఆధారపడకుండా మన పొట్ట మనం పోషించుకోవటానికి ఉపయోగపడతాయి. ఆత్మవిద్య అలా కాదు, మనలను శాశ్వతంగా అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలో నుండి విడుదలచేసి స్వాతంత్ర్యమైన సుఖములోనికి ఆనందమయమైన జీవితములోనికి చేరుస్తుంది. మీ మతాలు ఏవైనా, మీ గురువులు ఎవరైనా, మీ సాంప్రదాయాలు ఏవైనా ఇది ఒక్కటి గుర్తుపెట్టుకోండి. మన హృదయంలో ఉన్న సద్వస్తువును మనం అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పటివరకు మనకు సుఖం లేదు, శాంతి లేదు. మీ లోపలఉన్న సద్వస్తువుని దేహం తెలుసుకోలేదు, ఇంద్రియాలు తెలుసుకోలేవు, మనస్సు తెలుసుకోలేదు, బుద్ధి తెలుసుకోలేదు. మరి ఎవరు తెలుసుకొంటారు? ఆత్మ ఆత్మని తెలుసుకొంటుంది కాని ఆత్మకానిది ఆత్మను తెలుసుకోలేదు. అంటే ఆత్మ ఎంత పరిశుద్ధమైనదో, ఎంత పవిత్రమైనదో మన మనస్సు కూడా అంత పవిత్రమైతే, అంత పరిశుద్ధమైతే ఈ మనస్సే ఆత్మాకారం చెందుతుంది.

ఒకసారి లవకుశలు ఆంజనేయస్వామిని బంధించారు. లవకుశలు ఏమనుకుంటున్నారు అంటే మేము చాలా గొప్పవాళ్లము ఆంజనేయస్వామిని బంధించాము అనుకుంటూ వుంటే ఆంజనేయస్వామి నవ్వుకుంటున్నాడు. ఆంజనేయస్వామి అంటే శివ స్వరూపుడు. ఈ పిల్లకాయలు ఆయనని ఏమి బంధిస్తారు? ఆయన బంధింపబడాలనుకున్నాడు బంధింపబడ్డాడు. ఆంజనేయస్వామి ఏమన్నాడు అంటే మీరు నన్ను బంధించలేదు. నేను బంధింపబడాలనుకున్నాను బంధింపబడ్డాను అని చెప్పాడు. అలాగే ఆత్మ ఎవరికైతే తెలియబడాలి అనుకుంటుందో వారికి మాత్రమే తెలియబడుతుంది. ఎందుచేతనంటే మనం తెలుసుకోవటానికి అది మనకంటే చిన్న వస్తువు కాదు. ఆంజనేయస్వామి పిల్లలమీద ప్రేమకొలదీ తనంతట తానుగా ఎలా బంధింపబడ్డాడో అలాగే మనం చేస్తున్న సాధనలకు మనలో అంతర్యామిగా ఉన్న ఆత్మకు మన మీద దయకలిగి తనంతట తానుగా మనకు ఎఱుకలోనికి వస్తుంది. దానిని తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేస్తాము. మన ప్రయత్నానికి ఆయన అనుగ్రహం తోడు అయితే ఏదో క్షణంలో ఆయన మనకు అనుభవంలోనికి వస్తాడు. అది మన కడసారి జన్మ. అంటే మనకి ఆయన తెలియబడితే తెలుసుకోగలము కాని మనంతట మనం తెలుసుకోలేము. ఆయనను తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. ప్రయత్నం మానకూడదు. మనం ప్రయత్నం చేయటం వలననే ఆయన తెలియబడడు. మనం చేస్తున్న ప్రయత్నంలో సిన్సియారిటీ

ఉంటే మన మీద ఆయనకు దయకలిగి ఏదో రోజున ఆయన మనకు తెలియబడతాడు. అదే ఆత్మజ్ఞానం. ప్రపంచంలో ఇంత అలజడి ఉంది అంటే, ఇంత అశాంతి ఉంది అంటే, ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయి అంటే దీనికి కారణం కోరికలే.

మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అదే ప్రపంచము అంతా వ్యాపించి ఉంది. అది నిత్యము దానికి మార్పులేదు. మన కళ్ళకి కనిపించే చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు ఇది అంతా కూడా లీల. వీటిని ఎవడు తప్పించలేడు. ఈశ్వరసంకల్పం ప్రకారం ఇది అంతా జరిగిపోతూ ఉంటుంది. ఇందులో మన తెలివితేటలు ఏమీ లేవు. మనం సున్నలం అని తెలియక మనకి అన్నీ తెలుసు అనుకుంటాము కాని అన్నీ తెలిసినవాడు పరమేశ్వరుడు ఒక్కడే. నిత్యము అంటే పరాయిది అనుకోకండి. మన స్వరూపమే నిత్యము. నువ్వు నిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ లీలలో జీవిస్తూ నిత్యాన్ని పొందాలి. అంతేకాని లీలను పూర్తిగా వదిలేస్తే నిత్యాన్ని పొందలేవు. నువ్వు రాగద్వేషాలను కంట్రోలు చేసుకుంటూ నిత్యములో ప్రవేశించటానికి రెండు ద్వారాలు వున్నాయి. వాటినే శమము, దమము అంటారు. శమము అంటే మనోనిగ్రహము, దమము అంటే ఇంద్రియనిగ్రహము. మీ మనస్సు, ఇంద్రియాలు మీకు అదుపులో లేకుండా నిత్యములోనికి నువ్వు ప్రవేశించలేవు. భగవంతుడు కల్పించిన వాటిలో నుండి నువ్వు బయటకు రావాలి. మనస్సు, ఇంద్రియాలను అదుపులో పెట్టుకొని ఒకవేళ మీకు గర్వకారణాలు ఉన్నప్పటికీ గర్వం పొందకుండా అణిగివుంటే నిత్యానికి వెళ్ళటానికి మీకు దారి కనిపిస్తుంది. భగవంతుడు కల్పించిన లీలలో నువ్వు పెర్‌ఫెక్ట్‌గా జీవిస్తేనే ఆ పెర్‌ఫెక్షన్ నీకు దొరుకుతుంది. ఈ లీలను గాలికి వదిలివేసి ఏదో పొందుదాము, ఏదో పొందుదాము అనుకొంటే చివరకు దేనికి పనికిరావు, ఉభయ భ్రష్టత్వం వస్తుంది. మన డ్యూటీ మనం చేస్తూ దాని ద్వారా తరించాలి గాని ఎస్కేపిజం పనికిరాదు. మన దేహయాత్రకు సరిపడ పనిచేసుకుంటూ, సమాజానికి మనం చెయగలిగినది మనం చేస్తూ ఈ రెండింటి ద్వారా మనస్సును పవిత్రం చేసుకోవాలి. మీ కుటుంబం పట్ల మమకారం లేకుండా మీరు డ్యూటీ చేస్తూ ఉంటే అది కూడా వైరాగ్యంతోటి సమానమే.

ధన ఆగామి కాంక్ష పనికిరాదు అని ఆచార్యులవారు అన్నారు. నీ పని ఏదో నువ్వు చేసుకో, మీ వాటాకు ఏదైనా ధనం వస్తే ఎంజాయి చెయ్యికాని ఆ ధనం ఎప్పుడు వస్తుంది, ఎంత వస్తుంది అని ఆగామి కాంక్ష పనికిరాదు. ఆగామి కాంక్ష వలన మనస్సు పొల్యూట్

అవుతుంది. నీ ప్రారబ్ధాన్ని బట్టి నీకు వచ్చినది ఎంజాయి చెయ్యటం వలన అది నిన్ను బంధించదు కాని కోరి తెచ్చుకున్నది ఏదైనా నిన్ను బంధిస్తుంది. మీరు చెప్పే మాటలు ఎక్కువమంది వింటున్నారు దానికి కారణం ఏమిటి అని స్వామీజీని అడిగారు, హార్ట్, హెడ్, టంగ్, హేండ్ ఈ నాలుగు సమానంగా ఉంటే నువ్వు చెప్పిన మాటలు ఎవరైనా వింటారు, వారికి బాగుపడాలనే కాంక్ష వస్తుంది, లేకపోతే గాలికి పోతాయి అని చెప్పాడు. సబ్జక్టు చెబుతూ ఉండాలి, కఠినంగా చెప్పకూడదు, చెప్పేవిషయం తింగరగా ఉండకూడదు, చెప్పేది స్వీటుగా ఉండాలి, చెప్పే విషయం స్పష్టంగా ఉండాలి. బాగుపడాలనే తపన ఉండాలి. వాక్యం చెబుతూ ఉంటే ఆ ఇన్‌స్పిరేషన్ మీ హృదయంలోంచి రావాలి. మీకు మంచి పనులు చెయగలిగిన శక్తి ఉంటే చేయండి కాని మీరు చేసే మంచిపనులు కంటే, మంచి మాటల కంటే మంచి మనస్సు, స్వచ్ఛమైన మనస్సు ముఖ్యము. మీరు మంచి పనులు చేసి గర్వం తెచ్చుకొంటే దాని వలన పాడైపోతారు. మంచి పనులు చేయటం వలన మీకు పుణ్యం వస్తుంది. కాలప్రవాహంలో ఆ పుణ్యం అనుభవిస్తారు కాని ఆత్మజ్ఞానానికి మీకు దారి కనపడదు. ఇది బాగా గుర్తుపెట్టుకోండి. కర్తృత్వం, భోక్తృత్వం ఈ రెండు ఉన్నంతసేపు సంసారం వచ్చి తీరుతుంది. ఈ కర్తృత్వం, భోక్తృత్వం ఎంతకాలమైతే జీవుడికి ఉందో అంతకాలం వాడిని ఎవడూ రక్షించలేడు.

మనస్సు స్వచ్ఛము అవ్వాలి అంటే శమము, దమము ఉండాలి. శమము, దమము లేకుండా నేను ఎక్కడో కాలువలు తవ్వించాను, గుడి కట్టించాను అంటే దాని వలన పుణ్యం వస్తుంది కాని జ్ఞానము సున్న. ఈ విషయంలో బహుజాగ్రత్తగా ఉండమని చెప్పారు. ధనముతోటి, గౌరవాలతోటి, బంగారంతోటి కొనుక్కునేది కాదు ఆత్మజ్ఞానము. మీరు ఎంతోకొంత సాధన చేస్తూ ఉండాలి. మీ సాధనకు గమ్యం ఈశ్వరుడు అయి ఉండాలి. మనం ఏ పని చేసినా అంతర్యామిగా ఉన్నవాడు సంతోషించటానికి పని చేయాలి గాని గొప్పలకోసం పనిచేయకూడదు. గొప్పలకోసం పనిచేస్తే జ్ఞానంరాదు సరికదా చివరకు తిప్పలు వస్తాయి. మనోనిగ్రహం కంటే మించినది ఏదీ లేదు. మీరు అధ్యయనం చేయండి, జపం చేయండి, తపస్సు చేయండి మొత్తం అన్నింటియొక్క ప్రయోజనం మనస్సుని నిగ్రహించుకోవడమే. మనోనిగ్రహం వలన మీకు ఏదైనా సాధ్యమే. ఏ జీవుడు స్వతంత్రుడు కాడు. ఈశ్వరుడు ఒక్కడే స్వతంత్రుడు. భగవంతుడు యొక్క సంకల్పానికి విరుద్ధంగా ఏదీ జరుగదు. జీవితంలో మనకి ఏది జరిగినా ఆయన ప్రసాదమే అనుకోవాలి. ఆయనకు భిన్నంగా ఎవరూ ఏదీ చేసేది లేదు. భగవంతుడు

పట్ల భక్తి కలిగివుండు. ఆయన పాదాలను శరణువేడుకో. గురువు ఏమి చేస్తాడు అంటే బ్రహ్మపదార్థములో లయము అవ్వటానికి మనలో ఉన్న ఆటంకాలు ఏమిటో చూస్తూ వాటిని తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు. వాడు గురువు. మీ గౌరవాలను ఆశించేవాడు గురువు కాదు. బ్రహ్మానుభవం పొందటానికి ఏ బలహీనతలు, ఏ అలవాట్లు మీకు అడ్డువస్తున్నాయో వాటిని బయటకులాగి కాల్చి బూడిద చేస్తాడు అదే గురువు చేసే పని.

మనము జీవితంలో వైరాగ్యం, వివేకం ఈ రెండూ కట్టివేటు చేసుకోవాలి. ప్రపంచములో ఎన్నో గొడవలు జరుగుతున్నాయి. భూకంపాలు, వరదలు, గాలివానలు వస్తున్నాయి. ఈ లోకంలో జరుగుతున్న గొడవలు సూర్యుడుని ప్రభావితం చెయ్యలేవు. అలాగే జీవుడు చేసే పనుల ప్రభావం భగవంతుడిపై ఏమాత్రం ఉండదు. నువ్వు చేసేపనికి తగిన ఫలితం ఇస్తాడు. అంతేగాని జీవుడు చేసే ఏ పనికి వాడికి సంబంధం ఉండదు. నీ శరీరం చేసేపనికిగాని, నీ మనస్సు చేసేపనికి గాని లోపల అంతర్యామిగా ఉన్నవాడు ఏమీ మలినమవ్వడు. ఈ దోషాలు ఏమీ అంతర్యామిగా ఉన్న వాడిని అంటుకోవు. పరిస్థితులు మనకి అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనం నిదానంగా ఉండాలి. ఈ దేహాలు ఈ రోజు కనబడుతున్నాయి, రేపు కనబడకపోవచ్చు. ఈ అశాశ్వతమైన శరీరంలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. మీ మనస్సు ఆందోళనగా, అశాంతిగా ఉంది అనుకోండి లోపల ఉన్న అంతర్యామి అశాంతిగా ఉన్నాడు అనుకోవద్దు. మీ శరీరం చనిపోతుంది అనుకోండి లోపల అంతర్యామిగా ఉన్నవాడు కూడా చనిపోతున్నాడు అని అనుకోవద్దు. నీ పుణ్యపాపాలకు, లాభనష్టాలకు, మనస్సులో వచ్చే హెచ్చుతగ్గులకు, జనన మరణాలకు లోపల ఉన్న అంతర్యామికి ఎటువంటి సంబంధం లేదు. లోపల ఉన్నది శాంతిసముద్రం. మీ మనస్సు, ఇంద్రియాలు పూర్తిగా అణిగిపోయాక నీకు ఉన్న బేధబుద్ధి నశించాక లోపల ఉన్న వస్తువు తాలుక సుఖం, శాంతి నీకు తెలుస్తుంది. ఇప్పుడు మనం అందరము భగవంతుడులోనే ఉన్నాము. అది తెలియకపోవటం వలన భగవంతుడులోనే ఉండి భగవంతుడి కోసం వెతుకుతున్నాము. దానికి మన దేహబుద్ధి కారణము.

మనకు కనిపిస్తున్న శత్రువులకంటె, కనిపించని శత్రువులు ఎక్కువ ప్రమాదం అని శాస్త్రంలో చెప్పారు. కనిపించని శత్రువులు అంటే కోరిక, కోపం, లోభిత్వం, మదము, మాత్సర్యము. ఇవి అన్నీ మనలోనే ఉన్నాయి. ఎదుటివారు పచ్చగావుంటే వీరికి అసూయవచ్చి దూరం అయిపోతారు. కారణం ఉండదు. ఎదుటివారు పచ్చగా ఉంటే మనకు వచ్చిన

నష్టం ఏమిటి? అసూయ వలన కూడా శత్రుత్వాలు వస్తాయి. మోహం ఉన్నపుడు మనకి మంచి చెప్పేవాళ్ళని చెడ్డవాళ్ళు అనుకుంటాము. చెడ్డవారిని మంచి అనుకుంటాము. మోహం ఉన్నంతసేపు మీ బుద్ధిలో క్లారిటీరాదు. కొంతమందికి కూర్చోమంటే కోపం, నుంచోమంటే కోపం, అన్నము తినమంటే కోపం, తినవద్దంటే కోపం ఇవి అన్నీ జరుగుబాటు కోపాలు. కారణం ఉండదు. మనకి కారణం లేకుండా కోపం వస్తుంది కాని, కారణం లేకుండా భక్తిరాదు. ఒకటి గుర్తు పెట్టుకోండి, కారణం లేకుండా ఎవడికైతే భక్తి వచ్చిందో వాడు ఆ జన్మలోనే తరిస్తాడు. ఇంకవాడు తరించకుండా ఎవడూ ఆపుచేయలేడు. దానిని అకారణ భక్తి అంటారు. నదిలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగ మనకు ఈశ్వరుడు పట్ల అనురాగం, ఆప్యాయత, భక్తి ప్రవహిస్తూ ఉండాలి. భగవంతుడు మీద ఎందుకు ఇంత ప్రేమ కలిగిందని మనలో మనం ప్రశ్న వేసుకొంటే కారణం కనబడకూడదు. వాడికి మోక్షం వస్తుంది. రామకృష్ణుడికి చివర రోజులలో ఆయన శిష్యుడు అద్భుతానంద గొప్పగాసేవ చేసాడు. రామకృష్ణుడు అనేవాడు నీ సేవాభావం చూస్తూ ఉంటే, నీ ఆప్యాయత చూస్తూ ఉంటే, నీ ప్రేమ చూస్తూ ఉంటే నా దేహం కేన్సర్‌తో బాధపడుతున్నప్పటికీ ఇంకా కొంతకాలం ఉందామని అనిపిస్తోంది. నా శరీరములో నుండి ప్రాణాన్ని బయటకు నువ్వు వెళ్ళనివ్వటం లేదు అద్భుతానందా అనేవారు రామకృష్ణులు. అది నోటితో చెప్పే ఎఫెక్షన్ కాదు, జీతాలు పుచ్చుకొని చేసేది కాదు. గురువుకి సేవ చెయ్యటం ద్వారా గురువులో ఐక్యమయ్యాడు అద్భుతానంద.

ఒకడు గంగానదిలో స్నానం చేస్తూ నేను బ్రహ్మమును అయి ఉన్నాను, నేను బ్రహ్మమును అయి ఉన్నాను అంటున్నాడు. వాడికి కొంతదూరంగా మొసలి వెళుతోంది ఆ మొసలిని చూసి గబగబా ఒడ్డుకి వచ్చేసాడు. అప్పడు వాడికి ఏమి అనిపించిందంటే నేను బ్రహ్మమును అనుకుంటున్నాను బ్రహ్మమునకు చావులేదు, పుట్టుకలేదు అని నోటితో చెబుతున్నాను. మరి ఒడ్డుకు పారిపోయి వచ్చింది ఎవడు? నేను బ్రహ్మము అయితే ఎందుకు పారిపోయి వచ్చాను. గంగానదిలో స్నానము చేసేవాడే కాదు మన బ్రతుకులు కూడా అలాగే ఉన్నాయి. వాడు నిజంగా బ్రహ్మము అయ్యాడు అనుకోండి ఆ మొసలి కూడా వాడికి బ్రహ్మము క్రిందే కనిపిస్తుంది. మనకి ఎప్పడైతే దేహబుద్ధి వచ్చిందో మొసలికూడా మనలని మనిషి అనుకొంటుంది. మొసలిని చూసి మనకు ఎలా భయము వేస్తుందో మనలని చూసి మొసలికి కూడా అలాగే భయము కలుగుతుంది. మొసలిని చూసి భయము కలగటం వలన ఒడ్డుకి వచ్చేసి బతుకుజీవుడా అనుకున్నాడు. ఇలా బతుకుజీవుడా అనుకునేవాడు బ్రహ్మమా, జీవుడా? బ్రహ్మమునకు భయము

లేదు. భయపడేది జీవుడు. ఈ జీవుడుని పరిశుద్ధం చేసుకోకుండా, పవిత్రం చేసుకోకుండా ఊరికే నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును అని నోటితో అనుకోవడం వలన లాభం లేదు. రామకృష్ణుడుతో అద్భుతానంద అన్నాడు గురువుగారు నాకు రాగద్వేషాలను పోగొట్టుకోవాలని ఉంది కాని అవి పోవటం లేదు అన్నాడు. రాగద్వేషాలను నువ్వు ఊడగొట్టుకోలేవు. వాటి అంతట అవే పోవాలి. అవి పోవాలి, పోవాలి అనుకుంటే అవి పోవు. వాటిని పోగొట్టుకోవాలనే తపన నీకు ఎంత ఉందో అంత తీవ్రంగా భగవంతుడుని ప్రేమించు. భగవంతుడి లీలలు, కథలు, ఆయన భక్తులను ఎలా అనుగ్రహించాడో ఆ మహిమలు అన్నీ వింటూ ఉండు. భగవంతుడు నామాన్ని స్మరించు, ఆయన రూపాన్ని ధ్యానం చేసుకో. సత్పురుషుల సహవాసం చెయ్యి అప్పుడు ఇవి పోవాలి అని నువ్వు అనుకోనక్కర్లేదు. నీకు తెలియకుండానే నీకు కనపడని శత్రువులు ఈ రాగద్వేషాలు అన్నీ బయటకు పోతాయి అని రామకృష్ణుడు చెప్పాడు. మీకు ఏమీ నొప్పి లేకుండా ఆపరేషన్ జరిగిపోతుంది. లోపల శత్రువులని పెట్టుకొని "అహం బ్రహ్మాస్మి" అని నోటితో అనుకోవటం వలన ఏమీ ప్రయోజనం లేదు.

మనకు దేహబుద్ధి ఉన్నంతకాలము దేవుడు చెప్పినట్లు మనం వినాలి. ఆయన చేయమన్న పనులు చేస్తూ ఉండాలి, ఆయన వద్దన్న పనులు మానేయాలి, తర్కాలు అక్కర్లేదు. అద్భుతానంద రామకృష్ణుడితో ఏమి అన్నాడు అంటే మరల నాకు జన్మ ఇవ్వకండి మాయలో పడిపోతాను అంటున్నాడు. రామకృష్ణుడు ఏమి చెప్పారు అంటె అటువంటి భయాలు ఉంటె నీకు మోక్షం ఏమిటి పొమ్మన్నాడు. మరల జన్మ వచ్చింది అనుకో, ఇంద్రియాలు వచ్చేసాయి అనుకో, భోగము ఎదురుగుండా కనిపిస్తుంది అనుకో వికారాలు లేకుండా వుండాలి అది మోక్షము అన్నాడు రామకృష్ణుడు. ఎదురుగా పలావు కనిపిస్తుంది తినేయాలని ఉంది అంటె అది మోక్షమా? అది శాంతా? అది జ్ఞానమా? ఇలా భయపడి ఎన్నాళ్ళు సృష్టిలోనికి రాకుండా దాక్కుంటావు? ఇలా భయపడితే నీకు మోక్షం వస్తుందా? భోగాలు అన్నీ ఎదురుగా ఉన్నా నీ ఇంద్రియాలకు వికారం రాకూడదు. మోక్షం అంటే అది. మరల శరీరం వస్తే మాయలో పడిపోతాను అంటే అంత చిన్నవాడివా? శరీరం వస్తే మాయలో పడిపోతాను అని భయము వేస్తూ ఉంటే శరీరం రాకుండా ఎంతకాలం కాపలా ఉంటావు. రామకృష్ణుడు ఎలా చెబుతున్నాడో చూడండి, కేవలము మానవజాతి మీద ఉన్న ప్రేమవలన, అనుగ్రహం వలన చెపుతున్నాడు, ఇంకో కారణం లేదు.

# జ్ఞాన సూర్యుడు

**(ది॥ 23-09-2008 సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన సందర్భంగా)**

దైవానుగ్రహము మరియు అనేక జన్మల పుణ్యఫలముగా సద్గురువు లభిస్తారనే పరమసత్యానికి తార్కాణంగా భగవాన్ శ్రీ రమణమహర్షిచే "శ్రీ రమణ దివ్య సందేశాన్ని" మనకు అందించడానికి జిన్నూరు వాస్తవ్యులు సద్గురు శ్రీ నాన్నగారు ఒక దివ్య సాధనంగా ఎన్నుకోబడినారు. శ్రీ నాన్నగారి నిరాడంబరత, దయ, ప్రేమ, పూర్ణజ్ఞానంతో కూడిన సన్మార్గ సాధుజీవితం మానవాళికి అత్యంత ఆదర్శప్రాయమైనది. అత్యున్నత విలువలు కలిగిన జీవన విధానము, వారి దివ్య ఆధ్యాత్మిక మార్గదర్శకత్వము, అనుగ్రహము విశ్వవ్యాప్తము. సద్గురు శ్రీనాన్నగారు చిన్న చిన్న సూత్రాలు ద్వారా తత్త్వసారాన్ని బోధిస్తూ, వారి సమక్షముచేత, ప్రవర్తన చేత మనలోని వేరుబుద్ధిని నశింపజేస్తారు. సద్గురు శ్రీనాన్నగారి ప్రవచనాలలోని బోధ అత్యంత స్పష్టంగా, సహజంగా హృదయాన్ని తాకేదిగా ఉంటుంది, అట్టి దివ్య జ్ఞాన బోధను ఆస్వాదించే మనము ధన్యులము. సద్గురు శ్రీనాన్నగారి స్ఫూర్తితో అనేక ప్రాంతములలో శ్రీ రమణ సత్సంగములు ఏర్పాటుగావింపబడి స్వరూప ఎరుకలోనికి మేల్కొనుటకు వారధులగుచున్నవి. "బ్రహ్మము హృదయంలో స్వరూపంగానే ఉన్నప్పటికి, అహంభావన వల్ల అనుభవైక వేద్యం అగుటలేదు. వ్యక్తిభావన నశిస్తే కేవలం ఉన్నదే బ్రహ్మమను", శ్రీ నాన్నగారి బోధాసారాన్ని కేవలం శ్రవణానికే పరిమితం చెయ్యకుండా, ఆచరణలో పెట్టి స్వరూప, అద్వయ, ఆనంద స్థితిని అనుభవైకవేద్యం చేసుకోవడం ద్వారా మాత్రమే, సద్గురు శ్రీనాన్నగారి ఋణము తీర్చుకోగలము.

**- చావలి సూర్యనారాయణ మూర్తి**

టీచర్, అమలాపురం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 10 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, సత్యసాయి నిగమ్ (సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |
| అక్టోబర్ | 5 | నరసాపురం, తెలగ కళ్యాణ మండపం |
| అక్టోబర్ | 9 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**




జ్యోతిర్లింగం భీమాశంకరం దర్శనమునకు విచ్చేసిన సద్గురు శ్రీ నాన్నగారు



పూనాలో సద్గురు శ్రీనాన్నగారు - కేసరి దినపత్రిక ఎడిటర్ మరియు

లోకమాన్య తిలక్ మనుమడు శ్రీ దీపక్‌గారు